క్లుప్తంగా

బర్దిపూర్ సీఎస్ఐ చర్చి నూతన కమిటీ ఎన్నిక



డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఫాస్టర్ రెవరెండ్ జి దినకర్ తెలిపారు. ఫాస్టరేట్ నూతన మహిళా అధ్యక్షురాలిగా ఇందిర, కార్యదర్శిగా ఎస్ పాలు, స్టీవర్డ్ జి భాస్కర్, కోశాధికారిగా నీరడి పద్మారావు, ప్రాపర్టీ కార్యదర్శి గా ఎస్ దేవరాజ్, మహిళా కార్యదర్శిగా శకుంతల, సండే స్కూల్ కార్యదర్శిగా ఎస్ పద్మారావు, పూర్ పాండ్ కార్యదర్శిగా సురేందర్, సభ్యులుగా జాన్‌బాబు, కృప, ప్రతిమ, రుచిత, విమల, శోభ, ప్రకాశ్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

నూతన కార్యవర్గం..



పురాణం రమేశ్



గంగాధర్

మోపాల్: నగర శివారులోని ఆర్యనగర్‌లో ఉన్న న్యూ చైతన్య వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురాణం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా పాండురంగం, ఉపాధ్యక్షులుగా ప్రీతం, హన్మేందర్, ఉప కార్యదర్శిగా దినేశ్, ప్రచార కార్యదర్శిగా హన్మాండ్లు,క్రీడా కార్యదర్శిగా కెతావత్ శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా న్యాతికాల గంగాధర్, సలహాదారులుగా సత్యనారాయణ, ఈగ ఆత్మారామ్, నర్సింహులు, బాలరాజ్, నర్సాగౌడ్, శివప్రసాద్, ఆనంద్‌రెడ్డి, రంగయ్య, దత్తాద్రి ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారిగా నర్సింహు లు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఎరుకల(గిరిజన) హక్కుల ఐక్యపోరాట సాధన సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. ఆదివారం వినాయక్‌నగర్‌లోని మహనీయుల పార్క్‌లో ఏకలవ్య విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కుర్రు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, కోనేరు యాదగిరి, జయ రవి, జయ కిరణ్, మల్లపూర్తి, గణేశ్, యాదగిరి, పోశెట్టి, తదితరులున్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

నిజామాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీ, బోనస్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని అన్నారు.

సౌత్ కార్నివాల్‌లో విజయానంద్‌కు అవార్డు

నిజామాబాద్‌నాగారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణంలో ఆదివారం జేసీఐ ఆధ్వర్యంలో సౌత్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు 14 రాష్ట్రాలకు చెందిన 18 క్లబ్బులు పాల్గొన్నాయి. ఇందులో జిల్లా కేంద్రానికి చెందిన విజయానంద్ జేసీఐ అలుమ్ని క్లబ్ జోన్12లో వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. విజయానంద్‌కు ఉత్తమ జోన్ వైస్ చైర్మన్‌గా, అతను వ్యవహరిస్తున్న ఉత్తమ శిక్షణ విభాగం కోచింగ్ మెంటరింగ్, పబ్లిక్ రిలేషన్ కార్యక్రమాలకు అవార్డులు లభించాయి. అవార్డులను ఇండియా నేషనల్ చైర్మన్ అంజలి బాత్ర గుప్తా, నేషనల్ వైస్ చైర్మన్ జై కుమార్ విజయానంద్‌కు అందజేశారు. కార్యక్రమంలో జోన్ అధికారులు, చైర్మన్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

నిజామాబాద్ రూరల్: నగరంలోని పులాంగ్, పాముల బస్తీ, బోయిగల్లి, పలు ప్రాంతాల్లో మొహర్రం వేడుకలను ముస్లిములు ఆదివారం నిర్వహించారు. పీర్లను మసీదుల నుంచి వీధుల గుండా ఊరేగించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఉట్నూర్ మహేందర్ క్రీడా దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయుడు యూసుఫ్, పీఈటీ యాదగిరి, గ్రామ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలతో పొలాలు కలుషితం





కాలూరు-ఖానాపూర్ మధ్యలో బయటకు వస్తున్న పరిశ్రమల వ్యర్థాలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న రైతులు

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని ఖానాపూర్, కాలూర్‌లో అనేక పరిశ్రమలు, రైస్ మిల్లులు ఉన్నాయి. వీటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలను యజమానులు బయటకు వదులుతుండడంతో అవి సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లోకి, రోడ్లపైకి చేరుతున్నాయి. దీంతో పంట భూములు సారవంతం కోల్పోయి దిగుబడులు రావడం లేదని ఇటు రైతులు, వ్యర్థాల ద్వారా వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే చెప్పినా..

ఖానాపూర్, కాలూర్ శివారుల్లోని కొన్ని రైస్‌మిల్లుల నుంచి వెలువడే వడ్ల పొట్టు, బూడిద, పలు వ్యర్థాలు పంట పొలాల్లో, సమీప ఇళ్లల్లో పడుతుండటంతో ఖానాపూర్, కాలూర్ గ్రామస్తులు నిరసన, ధర్నాలు చేపట్టారు. రైతులు, స్థానికులు మున్సిపల్ కమిషనర్ సమస్యను విన్నవించినా స్పందన కరువైంది. చివరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులకు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి రైస్‌మిల్ యజమానులతో మాట్లాడారు. మూడు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన రైస్‌మిల్ యజమానులు ఆరు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు, రైతులు వాపోతున్నారు. ఎప్పటిలాగే పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఖానాపూర్, కాలూర్ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. అనార్యోగానికి గురవుతున్నాం. పంట పొలాలు భూసారవంతం కోల్పోతున్నాయి. అధికారులు స్పందించాలి.

– కొర్వ రాజేందర్, ఖానాపూర్

విష జ్వరాలు వస్తున్నాయి



మండల పరిధిలోని ఒకటవ డివిజన్ ఖానాపూర్, కాలూర్ పరిధిలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. అందులో నుంచి వెలువడే వ్యర్థాలతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా స్పందన కరువైంది. ఉన్నతాధికారులు స్పందించాలి.

– సందీప్‌రెడ్డి, కాలూర్

ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

సుభాష్‌నగర్: శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త పని చేసి పార్టీని బలోపేతం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదని అన్నారన్నారు. జాతి ఐక్యతకు ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. ముఖర్జీ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ తన జీవితాన్నే అంకితం చేశారని, ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్ జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖర్జీ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రధాని మోదీ 370 ఆర్టికల్‌ను రద్దుచేసి కశ్మీర్ సుందరీకరిస్తున్నారని తెలిపారు. నాయకులు న్యాలం రాజు, మల్లేశ్ యాదవ్, పల్నాటి కార్తీక్, కస్తూరి కృష్ణ, నారాయణ యాదవ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి చేరికలు

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



పార్టీలో చేరిన యువకులతో ముప్ప గంగారెడ్డి

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. ఆదివారం మోపాల్ మండలంలోని ముదక్‌పల్లికి చెందిన 20 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ముప్ప గంగారెడ్డి, ఎల్లోల్ల సాయిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు పార్టీ సిద్ధంగా ఉందని, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఈదుల సాయిలు, పిడుగు సంతోష్, మహేశ్, సురేశ్, గోపి, పోశెట్టి, బాలయ్య, తెడ్డు బాబు, సంతోష్, సాయిలు, నరేశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే బంజారాల అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తారాచంద్‌నాయక్

డిచ్‌పల్లి: జిల్లాలోని బంజారాలు ఐక్యతతో ఉంటేనే తండాల అభివృద్ధి సాధ్యమని ఆలిండియా బంజారా సేవా సంఘం(ఏఐబీఎస్ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారాచంద్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో నిర్వహించిన ఏఐబీఎస్ఎస్ తొలి జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని ఓ వర్గం నాయకులు బంజారాల్లో చీలిక తేవడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏఐబీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో బంజారా సేవా సంఘాలు నిర్మించామని, కొత్తగా ఏర్పడిన మిగిలిన మండలాల్లో సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నిధుల కోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీఎంను కలుస్తామన్నారు. తండాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నిధులు మంజూరు చేయడానికి సుముఖంగా ఉన్నారని తారాచంద్ తెలిపారు. రాబోవు రోజుల్లో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించే దిశగా తండాల్లో ఐక్యతగా ఉండాలని సూచించారు. జిల్లా నూతన అధ్యక్షుడు బాబురాం మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజన తండాల్లో ఉన్న ప్రధాన సమస్యలను జిల్లా కమిటీకి తెలియజేస్తే వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రునాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షులు రమేశ్, బలరాం, కార్యదర్శులు బీమ్లా నాయక్, బలరాం, జాయింట్ సెక్రటరీ విఠల్ రాథోడ్, మోజీరాం, డిచ్‌పల్లి మండల సంఘం అధ్యక్షుడు రాథోడ్ జగదీశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సురేశ్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



నిజామాబాద్‌అర్బన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రైల్వే కమాన్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సరిగా పోశెట్టి, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మహేశ్, గంగారం పాల్గొన్నారు.

మొటాటిరెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డి



సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ మొటాటి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గాదారి సంజీవ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న రాజారెడ్డి నిలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డి, కార్యదర్శిగా మోతె నవీన్‌రెడ్డి, కోశాధికారిగా అర్కల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎడ్ల దామోదర్ రెడ్డి, అంగలి మురళీధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కుమార్ రెడ్డి, సలహాదారులుగా చిన్నపట్ల విజయేందర్‌రెడ్డి, గుడిపల్లి నాగిరెడ్డి, కోతి చంద్రశేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, ఈసీ మెంబర్లుగా మూల జనార్దన్‌రెడ్డి, ఏరా వినోద్‌రెడ్డి, బేతి రవీందర్‌రెడ్డి, మోస్రా గంగారెడ్డి, సాయిరెడ్డి, లీగల్ అడ్వయిజర్‌గా సుభాష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రాజాబహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు సన్మానించారు.

నేడు మహిళా ప్రాంగణంలో క్యాపింగ్ సెర్మనీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయ్ మహిళ శిశు వికాస కేంద్రంలో సోమవారం ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాపింగ్ సెర్మనీ నిర్వహిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ ఇందిర తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ మహిళ, శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



విఠలేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



జెండా బాలాజీ ఆలయంలో క్యూకట్టిన భక్తులు

నిజామాబాద్ రూరల్/ సుభాష్‌నగర్/ సిరికొండ/ డిచ్‌పల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని జెండా బాలాజీ మందిరం, ఉత్తర తిరుపతి క్షేత్రం, విఠలేశ్వర ఆలయం, చక్రం గుడి, శ్రీకృష్ణ గీత మందిరం, పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని నాందేవ్‌వాడలో ఉన్న విఠలేశ్వర ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఆషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశి మొదటి పండుగని, హిందువులకు ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని శ్రీ శేష సాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండలంలోని వైష్ణవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



సిరికొండలో దర్శనానికి వచ్చిన భక్తులు



డిచ్‌పల్లిలో..

సార్వత్రిక సమ్మెపై రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నిజామాబాద్ సిటీ: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని ఐక్య వామపక్ష సంఘాల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోని సీఐటీయూ కార్యాలయంలో పెద్ది వెంకట్రాములు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, ఐద్వా, కేవీపీఎస్, ఒడ్డెర వృత్తిదారుల సంఘం, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం, ప్రజానాట్యమండలి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధులు, నాయకులు నూర్జహాన్, వెంకటేశ్, రమేశ్ బాబు, సుజాత, కొండ గంగాధర్, ఇడగొట్టి సాయిలు, రాచకొండ విఘ్నేశ్, లింగం, గోవర్ధన్, లక్ష్మీనర్సయ్య, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు. కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ, హెచ్ఆర్ఎఫ్, పీవైఎల్ సంఘాలు మద్దతు ప్రకటించాయని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ద్వారకానగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు దాసు, సూర్య, శివాజీ, నీలం సాయిబాబా, మల్లికార్జున్, శివకుమార్, గంగాధర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం జీవో 282ను రద్దు చేయాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సముదాయాల్లో పనిగంటలు పెంచుతూ ఇచ్చిన జీవో 282ను రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించి జీవో ప్రతులను దహనంచేశారు. అనంతరం ఓమయ్య మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 పని గంటలను 10 గంటలకు పెంచడం కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, చక్రపాణి, భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, స్వప్న, లాయక్, సాయిలు, భానుచందర్, తిరుపతిరెడ్డి, సాయన్న, కైసర్, లక్ష్మణ్ పాల్గొన్నారు. ప్రభుత్వం జారీ జీవో 282ను రద్దు చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నరేందర్, ముస్కె సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగల్లి శ్రామిక భవన్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు వెంకన్న, డి.రాజేశ్వర్, పి.సాయన్న పాల్గొన్నారు.

బ్లడ్ స్టెమ్‌సెల్ దానంపై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం బ్లడ్ స్టెమ్ సెల్ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పండరి శక్తి ఫౌండేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నిజామాబాద్ ధాత్రి ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పుష్పలత పవార్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండరి శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌరీ పవార్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టడంపై అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సు ఆంజనేయులు, ధాత్రి ఫౌండేషన్ ప్రతినిధి రవీంద్రనాథ్, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోటరాజశేఖర్, ఫౌండేషన్ కుమారి గౌరీ పవార్, సాయి ప్రసాద్, రవీందర్, బంటు రాము, మాజీ కార్పొరేటర్ కృష్ణ పటేల్, రాజ్ కుమార్ సుబేదార్, హనుమంతరావు, అశోక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టీవీఏసీ జేఏసీ నిరవధిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఏసీ ప్రతినిధులు

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థలోని 20వేల మంది ఆర్టిజన్ కార్మికుల విద్యార్హత బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఈనెల 14 నుంచి చేపట్టిన నిరవధిక సమ్మె పోస్టర్‌ను జేఏసీ చైర్మన్ సుజాయత్ అలీ ఆదివారం నగరంలోని తిలక్‌గార్డెన్‌లో ఆవిష్కరించారు. ఒకే సంస్థలో పని చేస్తున్న వారికి ఒకే రూల్ అమలు పర్చాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీవీఏసీ జేఏసీ కన్వీనర్ బట్టు గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లూరి నరేశ్, పాకాల మహేశ్, రాములు, రవీందర్, రాంప్రసాద్, జాదవ్ మురళీకుమార్, సాయిబాబా, వేణుగోపాల్, మోహన్, శశి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ల ఏర్పాటు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం రెండు కొత్త బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ గంగారాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్రేకర్ల ఏర్పాటు పూర్తయ్యే వరకు డిచ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బీబీపూర్ తండా, డిచ్‌పల్లి రైల్వేస్టేషన్, ఘన్‌పూర్, టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని కోరారు.

గోర్ బోలి భాషను సంరక్షించాలి

నిజామాబాద్‌రూరల్: గోర్ బోలి భాషను సంరక్షించాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ డిమాండ్ చేశారు. ఆదివారం వినాయక్‌నగర్‌లో సంఘ కార్యాలయంలో అయన మాట్లాడారు. బంజారా మేధావులుతో కమిటీ ఏర్పాటు చేసి గోర్ భాష లిపి పై చర్చించి ప్రాచీన భాషగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గఫూర్ శిక్షక్ అల్లి మోహనరాజ్, లింగం పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నిజామాబాద్ సిటీ: అలీ సాగర్, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ...

లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్ కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించడం లేదని దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్, గణేశ్, కార్తీక్, బుచ్చన్న, సందీప్, పవన్, రమేశ్, అజయ్, నరేశ్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,200	వెండి(కిలో)	1,11,500
22 క్యారెట్స్	90,650	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	100	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	80	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	30	50
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	50	80
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్